లెదర్ పరిశ్రమలను పునరుద్ధరించండి..

ఎల్ఐడీ,సీఏపీ ఎండీ శ్రీనివాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న చర్మకార జేఏసీ నాయకులు

రవీంద్రభారతి, నవంబర్ 14: పొల్యూషన్ పేరుతో రాష్ట్రంలో లెదర్ పరిశ్రమలను మూసివేశారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని చర్మకార జేఏసీ నాయకులు అధికారులను కోరారు. గురువారం తెలంగాణ చర్మకారుల జేఏసీ చైర్మన్ మురళీదర్శన్, కే.శ్రీనివాస్ మాదిగ, రాజలింగం, సతీశ్ మాదిగ, చింతస్వామి, చుంచు లింగయ్య ప్రైవేట్ లెదర్ పరిశ్రమల యాజమాన్యాలతో ఎల్ఐడీ, సీఏపీ ఎండీ శ్రీనివాస్‌నాయక్, పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్లను నగరంలోని నాయుడమ్మ లెదర్ పరిశ్రమ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ లెదర్ పరిశ్రమలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ఇప్పటికైనా లెదర్ పరిశ్రమలను పునరుద్ధరించి, మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని వారు కోరారు.

లెజెండరీ అవార్డులకు దరఖాస్తులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 14 : అభిలాష.. హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలను పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని లెజెండరీ అవార్డులతో సత్కరించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్దుల్ కలాం, కొమరం భీమ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, సాలూరి రాజేశ్వర రావు లెజెండరీ అవార్డులతో పాటు వేణుమాధవ్, ఏవీఎస్, పునీత్‌రాజ్ కుమార్, ఎమ్మెస్ సత్యనారాయణ హాస్య ఎక్సలెన్సీ అవార్డులకు అర్హులైన వారు నవంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 6302908528 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పోటీలు చిన్నారుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయి..

- సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య
- ఘనంగా బాలల దినోత్సవం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 14. సాహిత్య, సాంస్కృతిక, క్రీడలు తదితర అంశాలలో పోటీలు నిర్వహించడంతో బాలల మధ్యపోటీతత్వం పెరిగి మరింతగా రాణిస్తారని తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల అన్నారు. తెలంగాణ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం బాలల దినోత్సవం-2024ను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రగీత రచయిత అందెశ్రీ, సాహిత్య అకాడమీ ఛైర్మన్ డాక్టర్ నామోజు బాలాచారి మాట్లాడారు. సంగీత నాటక అకాడమీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు. పిల్లల ఆటపాటలు, నృత్యాలు, ఏకపాత్రాభినయాలతో ఆడిటోరియం హోరెత్తింది. పూర్ణచంద్ర మ్యాజిక్ షో సహచర చిన్నారులను అలరించింది. అనంతరం సాహిత్య పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు బహుమతులు పంపిణీ చేసిన వక్తలు

- బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అరవింద్‌నగర్‌లో గల సుదీక్ష కిడ్స్ పాఠశాలలో గురువారం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, ఫ్రాగ్ జంప్, రన్నింగ్ పోటీలు, డ్యాన్స్ కాంపిటీషన్, విష్ణుసహస్ర నామాల ఆలాపన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించిన డైరెక్టర్ పూస నరేందర్, ప్రిన్సిపాల్ రమ్య బహుమతులను అందజేసి ఉత్సాహపరిచారు.

విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలి

కాచిగూడ : దేశ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు బాధ్యతగా తెలుసుకోవాలని నింబోలిఅడ్డా ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎన్.మైథిలీ అన్నారు. బాలికల సదనంలో గురువారం బాలల దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మైథిలీ మాట్లాడుతూ.. తెలంగాణ విశిష్టతలను విద్యార్థులకు తెలియజేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ నెల 20న 'చైల్డ్ రైట్స్ కన్వెన్షన్' వీక్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ఉదయ రాణి, రమాదేవి పాల్గొన్నారు.

కాచిగూడ : బాలల దినోత్సవంలో పాల్గొన్న సూపరింటెండెంట్ మైథిలీ, తదితరులు

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి

అబిడ్స్ : విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ అన్నారు. రహీంపురా ప్లే గ్రౌండ్స్‌లో రిలయన్స్ హైటెక్ స్కూల్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. పాఠశాల కరెస్పాండెంట్ టి. జితేందర్ సింగ్, గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్, మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, అనిల్ సింగ్, పాఠశాల కరెస్పాండెంట్ టి. నిషాఠాకూర్, ప్రిన్సిపాల్ టి. మమతారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అబిడ్స్ : విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్

అంబర్‌పేటలో..

అంబర్‌పేట : దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్యాన్సీ డ్రెస్‌లలో అదరగొట్టారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమంలో విశేషంగా అలరించాయి. వివిధ వేషధారణలో వారు మెరిశారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎన్.ఉషారెడ్డి, సెక్రటరీ సునంద, ప్రిన్సిపాల్ ఆకుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో..

మంచి పనులు చేసేందుకు ముందుకురావాలి

సేవా రంగ ప్రముఖులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ

రవీంద్రభారతి, నవంబర్ 14: ఎదుటి వారిని ఇబ్బంది పెట్టకుండా ఉండటమే దయార్థ హృదయమని, రియల్ కైండ్‌నెస్ అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో 'వరల్డ్ కైండ్‌నెస్ డే'ను ఘనంగా నిర్వహించారు. బుర్ర వెంకటేశం, జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని సంస్థలు, వ్యక్తులు సమాజ హితం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ అల్యూమినీ క్లబ్ చైర్మన్ జీవీఎన్ రాజు, జోనల్ కార్యదర్శి గుప్తా, జోన్ వైస్ చైర్మన్ రేణుక అగర్వాల్, శంకర్, రేవతిపుట్ట, చందన పాల్గొన్నారు. 50 సంవత్సరాలుగా సేవా రంగంలో పాల్గొంటున్న డాక్టర్ ప్రకాశ్ రావు, భవాని, విశ్వేశ్వర శాస్త్రి, దొరరాజును ఈ సందర్భంగా సన్మానించారు.

సంగం రామాలయంలో ఘనంగా జ్వాలా తోరణం

మెహిదీపట్నం, నవంబర్ 14 : కార్తిక పౌర్ణమి పూజలలో భాగంగా లంగర్‌హౌస్ సంగం రామాలయంలో జ్వాలా తోరణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగం మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని సంగం వద్ద పుణ్యస్నానమాచరించడానికి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు రాహుల్‌దాస్ బాబా తెలిపారు.

అయ్యప్ప పడిపూజ

లంగర్‌హౌస్ బాపూనగర్ మందులబస్తీలో ఉన్న స్తంభాల మైసమ్మ ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా జరిగింది. లంగర్‌హౌస్‌కు చెందిన మాణిక్‌రావు ఏర్పాటు చేసిన పడిపూజలో గురుస్వాములు కారింగుల గోపిగౌడ్, దండోతికార్ సంతోష్ కుమార్, ఉదయ్‌గౌడ్ స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేపు ఉద్యమకారుల సమావేశం

కాచిగూడ,నవంబర్ 14: తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సమావేశం ఈనెల 16న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులు 70 ఏండ్లకు పైబడి ఉండటంతో అనేక అనారోగ్య, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారని వారికి ప్రభుత్వం రూ.30 వేల పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

భారత్‌సురక్షా సమితి ఆధ్వర్యంలో మౌన దీక్ష

దేశ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన సమయంలో 1975 నవంబర్ 14న చేపట్టిన నిరసన దీక్షలను గుర్తు చేసుకుంటూ గురువారం లంగర్‌హౌస్ బాపూఘాట్ ఆధ్వర్యంలో భారత్ సురక్షా సమితి ఆధ్వర్యంలో ఆదే స్ఫూర్తితో మౌనదీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు యమన్‌సింగ్, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు మాధవ రెడ్డి, రమేశ్, బాలప్రసాద్ తివారి, కె.నరసింహారావు, జియాగూడ కార్పొరేటర్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, నవంబర్ 14

ఉద్యమ నాయకుడు పురుషోత్తం గుప్తాకు నివాళి

పురుషోత్తం గుప్తా చిత్ర పటం వద్ద నివాళులర్పించిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, సంతోష్‌గుప్తా తదితరులు

అబిడ్స్, నవంబర్ 14: స్వాతంత్ర్య సమరయోధులు పసుపర్తి పురుషోత్తం గుప్తా తొలి మలి దశ ఉద్యమ నాయకుడని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కొనియాడారు. నాంపల్లిలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పురుషోత్తం గుప్తా వర్ధంతి కార్యక్రమానికి ఆమె విచ్చేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మాజీ కార్పొరేటర్ మమత సంతోష్‌గుప్తా మామ పురుషోత్తం గుప్తా 1969న తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాలు పంచుకున్నారని, అదే విధంగా మలి దశ ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొని 2001లో రాజకీయాలలోకి వచ్చి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, మంగళ్‌హాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్వీ మహేందర్‌కుమార్, మెట్రో ఫుట్‌వేర్ అధినేత సలీం, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు చిరునామాగా సింగరేణిని నిలపాలి

ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 14 : నాణ్యతకు చిరునామాగా సింగరేణిని తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని డైరెక్టర్(పీఆర్‌పీ, పర్సనల్)జి. వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. సింగరేణిభవన్‌లో బొగ్గు నాణ్యతా వారోత్సవాల సందర్భంగా గురువారం వెంకటేశ్వర్‌రెడ్డి క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో నాణ్యత లోపిస్తే కోట్ల రూపాయాల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పోటీ మార్కెట్‌లో నాణ్యమైన సేవలు అందించే సంస్థలకే మనుగడ ఉంటుందనే విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు సాగాలని కోరారు. జనరల్ మేనేజర్(కో ఆర్డినేషన్) ఎస్డీఎం సుభానీ మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తితో పాటు వృత్తి పరంగా ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ పని చేయాలన్నారు. అనంతరం ఉద్యోగులు నాణ్యత ప్రతిజ్ఞ చేశారు. జీఎం(సేఫ్టీ) చింతల శ్రీనివాస్, జీఎం(సివిల్)సూర్యనారాయణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మేరులకు రుణాలు మంజూరు చేయాలని వినతి

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించిన రాష్ట్ర మేరు సంఘం నాయకులు

అబిడ్స్, నవంబర్ 14 : చేతి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేరు కులస్తులను బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ మేరు సంఘం నాయకులు కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు నాయకులు కె.వెంకటేశ్, కీర్తిరాజ్ గోపాల్, దీకొండ నరసింగరావు, ఎస్‌బీ సంగేవార్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు మాసాబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు పది లక్షల వరకు ఉన్న మేరు కులస్తులు కుల వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా ఆదుకుని, టైలర్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు తగిన మిషన్‌లు, సామాగ్రి కొనుగోలు కోసం మూడు లక్షల సబ్సిడీ ఋణాలు మంజూరు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అంకుట్ పూజలు

కాచిగూడ : అంకుట్ పూజలో పాల్గొన్న కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ తదితరులు

కాచిగూడ, నవంబర్ 14: ఆధ్యాత్మికత చింతనతో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. కాచిగూడ, వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబామందిర్‌లో అంకుట్ పూజా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ అమ్మవారిని దర్శించుకుని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్యామ్ బాబామందిర్ సభ్యుడు రామ్‌దేవ్‌అగర్వాల్, కన్నె రమేశ్‌యాదవ్, సుభాష్‌పటేల్, ఆర్. సంతోష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అబిడ్స్ పరిధిలో..

అబిడ్స్ : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని హుస్సేని ఆలం ఓల్డ్ కబుతర్ ఖానలోని ఆలయంలో శ్రీ బాలవీర్ భక్త్ సమాజ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంకుట్ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ కమిటీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చైర్మన్ మురళీ మోహన్ అశోక్‌సింగ్ అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ చోక్డా, ఆకాశ్ అగర్వాల్, మనోహర్, సంజీవ్‌కుమార్, బన్సీ రాజ్, టి.శ్రీనివాసరావు, సుభాష్, విజయ్ శర్మ, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ కమిటీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చైర్మన్ మురళీమోహన్ అశోక్ సింగ్

జాతీయ స్కూల్ ఆర్చరీ టోర్నమెంట్‌కు లలితారాణి

కాచిగూడ, నవంబర్ 14 : కాచిగూడ జూనియర్ కాళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి లలితారాణి 15 నుంచి 19 వరకు గుజరాత్‌లోని నదియాలో జరుగునున్న జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు లలితారాణి ఎంపికైనట్లు కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8, 9 తేదీల్లో కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఆర్చరీ టోర్నమెంట్ ఈవెంట్ పోటీల్లో లలితారాణి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లలితారాణిని కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, వి.ప్రసాద్ రావు, గీతాబాయి, శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

డివిజన్ అభివృద్ధికి యుద్ధ ప్రతిపాదికన చర్యలు

కాచిగూడ,నవంబర్ 14: స్థానికుల సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. డివిజన్‌లోని జమాల్‌బస్తీ, మోతిమార్కెట్ బస్తీలలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డును పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గురువారం పాదయాత్ర నిర్వహించి రోడ్డు సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని రోడ్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, భీమగౌని కృష్ణగౌడ్, సుభాష్‌పటేల్, కృష్ణకుమార్, క్షీర్‌సాగర్, ఆర్.సంతోష్, భీమ్‌రాజ్, సూలం రవియాదవ్, అరవింద్, నాగు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న లైబ్రరీ స్టూడెంట్స్, నిరుద్యోగ సంఘం సభ్యులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 14 : రాష్ట్ర వ్యాప్తంగా పౌర గ్రంథాలయాలలో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్‌తో పాటు అనుబంధ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ లైబ్రరీ స్టూడెంట్స్, నిరుద్యోగ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణ స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన నేషనల్ లైబ్రరీ డే, జాతీయ లైబ్రరీ వీక్ వారోత్సవాల సందర్భంగా వారు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర పౌర గ్రంథాలయాలు, గ్రంథాలయ పరిషత్‌లలో గ్రేడ్-1, 2, 3లలో గల అన్ని లైబ్రేరియన్ అనుబంధ ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్స్ వేయాలని అన్నారు. పౌర గ్రంథాలయాల పరిషత్‌లలో లైబ్రరీ సిబ్బంది కొరతతో మూతపడే పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లైబ్రరీ స్టూడెంట్స్, నిరుద్యోగ సంఘం సభ్యులు మంజుల, ఆకుల సాయిలు, సాయి చరణ్, పవన్, సుమన్ తదితరులు ఉన్నారు.

నాంపల్లి కోర్టులో ఉచిత కంటి వైద్యపరీక్షలు

జిల్లా జడ్జి సురేశ్‌కు కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 14(నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ సౌజన్యంతో గురువారం న్యాయవాదులకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జి సురేశ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా జడ్జికి వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. న్యాయవాదులకు కంటి పరీక్షలు నిర్వహించి 200 కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజవంతం చేసేందుకు అధ్యక్షుడు రాజ్యవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, సంయుక్త కార్యదర్శి మామిడాల రమేశ్, కోశాధికారి రాజ్‌గోపాల్ లడ్డా, ఉపాధ్యక్షుడు గోకుల్, సభ్యులు విశేషంగా కృషి చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, వైద్యసిబ్బందికి బార్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

సహకార వారోత్సవాలు



సహకార జెండాను ఎగురవేసి మాట్లాడుతున్న రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు

సుల్తాన్‌బజార్,నవంబర్ 14 : వికసిత్ భారత్ దృక్పథాన్ని సాకారం చేయడంలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తూ 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుపుకుంటున్నామని రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. గురువారం కోఠిలోని టీజీ క్యాబ్ ప్రధాన కార్యాలయం ఆవరణలో భారత ప్రథమ ప్రధానమంత్రి నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రతి యేటా నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల్లో భాగంగా ఆయన సహకార జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో టీజీ క్యాబ్ సీజీఎం టి.జ్యోతి, జీఎంలు కేవల్ సురేఖ, ఎంఆర్ శ్రీనివాస్‌రావు, సుజాతతో పాటు ఇతర బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

అబిడ్స్, నవంబర్ 14: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మెదక్ డియోసెస్ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్ రెవరెండ్ బి. విన్‌స్టన్ కోరారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్‌లో 190 సంవత్సరాల వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్, ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను రెవరెండ్ బి. విన్‌స్టన్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ సెక్రటరీ రెవరెండ్ ఎం జయానంద్, లే సెక్రటరీ డీసీ రిప్రజెంటీవ్ జి. ప్రభుకుమార్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్ సత్యానందం, జి.ఈబర్ జయపాల్, పవన్ ప్రభుకుమార్, మంత్రి సోలోమన్, డాక్టర్ సి సోలోమన్‌రాజ్, డాక్టర్ ఎం. విల్సన్, ప్రిన్సిపాల్‌లు రుత్ లజ్‌వంతి, జె మార్థా నిస్సి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రెవరెండ్ బి. విన్‌స్టన్

బతుకమ్మకుంటపై స్టేటస్‌కో వచ్చింది..

మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట, నవంబర్ 14: బతుకమ్మ కుంట స్థలం విషయంలో హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన నివాసంలో ఈ విషయమై మాట్లాడారు. హైకోర్టు లంచ్ మోషన్‌ను అనుమతి ఇచ్చి రెండున్నరకు కేసును తీసుకోవడం జరిగిందన్నారు. న్యాయస్థానం సుదీర్ఘంగా చర్చించి రెండు వారాల స్టేటస్‌కో ఇచ్చిందని చెప్పారు. రెవెన్యూ, మున్సిపల్, హైడ్రా, ఇరిగేషన్ అన్నీ డిపార్ట్‌మెంట్లను ప్రతివాదులుగా చేయడం జరిగిందని, వాదోపవాదాలు జరిగిన తర్వాత ఈ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. స్థలం సయ్యద్ ఆజాం పొజిషన్‌లో ఉందని తాసీల్దార్ లెటర్‌లో ఇచ్చారని, దాని ప్రకారం రెండు వారాల స్టేటస్‌కో ఇచ్చారని దీనిపై కౌంటర్ ఫైల్ చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత రాక్షసంగా డిపార్ట్‌మెంట్ బ్యూరోకాట్లను కూడా వదలడం లేదు. ఇది వి.హనుమంతరావుకు చెంపపెట్టు అని భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ నాయకుడు రంగారెడ్డి

మెహిదీపట్నం నవంబర్ 14: రాష్ట్రాన్ని సాధించిన ఘనత తొలి సీఎం కేసీఆర్‌దని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గున్నాల రంగారెడ్డి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సమరయోధుల కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వండి

అబిడ్స్, నవంబర్ 14: స్వాతంత్ర్య సమరయోధులైన తమ కుటుంబానికి ఎలాంటి ప్రభుత్వ లాభం చేకూరలేదని స్వాతంత్ర్య సమరయోధుడు పాల్కం యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. నేడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పాల్కం శ్రీనివాస్ ఇప్పటి వరకు ఎలాంటి నామినేటెడ్ పదవులను పొందలేదని త్వరలో జరగబోయే నామినేటెడ్ పదవుల పంపకంలో పాల్కం శ్రీనివాస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్కం శ్రీనివాస్, ఆదిమూలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్

అబిడ్స్, నవంబర్ 14 : ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చింతల్‌బస్తీలో నివసించే బి. లక్ష్మణ్ (43) జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, ఆగస్టు 22వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన ఆయన భార్య గీతా బాయి సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గోపాల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.